క్లుప్తంగా

30లోపు అడ్మిషన్ పొందాలి

రాజంపేట టౌన్ : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో నెల 30వ తేదీలోపు అడ్మిషన్ పొందాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ.రమణరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ పొందేందుకు విద్యార్థులు టెన్త్ మార్కు లిస్టు, టీసీ, ఆధార్ర్డు, తల్లికి సంబంధించిన బ్యాంకు పుస్తకం ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు తమ వెంట తీసుకు రావాలని చెప్పారు. అలాగే విద్యార్థులు తమ తల్లిదండ్రులు లేక సంరక్షకులను కూడా వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. 30వ తేదీ తరువాత అడ్మిషన్ల ప్రక్రియ ఉండకపోవచ్చని ప్రిన్సిపల్ తెలియజేశారు.

చిట్వేలి హైస్కూల్‌లో అడ్మిషన్లు



అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ప్రధానోపాధ్యాయులు బి.దుర్గరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అడ్మిషన్‌ల ప్రక్రియను నిర్వహించారు. పాఠశాలకు అనుబంధంగా బాలురకు సమీకృత వసతి గృహం, బాలికలకు ప్రత్యేకంగా మూడు వసతి గృహాలు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు పాఠశాలలో చేరుతుంటారు. ఇప్పటి వరకు పాఠశాలలో 40 అడ్మిషన్లు జరిగినట్లు ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు తెలిపారు.

కోరంలేక సమావేశం వాయిదా

సుండుపల్లె : ప్రజా సమస్యల పరిష్కారానికి శుక్రవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరైనప్పటికీ ప్రజా ప్రతినిధులు ఎవరూ సమావేశానికి హాజరుకాక పోవడంతో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి సర్వసభ్య సమావేశాన్ని 18వ తేదీకి వాయిదా వేశారు.

బాధ్యతల స్వీకరణ



ఈశ్వర్‌ప్రసాద్

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె పశువుల ఆసుపత్రి వైద్యాధికారిగా డాక్టర్ ఈశ్వర్‌ప్రసాద్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారిణి డాక్టర్ శ్వేత గువ్వలచెరువుకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో అట్లూరు మండలం కలమకూరులో పని చేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు.

వీరబల్లి ఎంపీడీఓగా..



జవహర్ బాబు

వీరబల్లి : మండలం ఎంపీడీఓగా నూతనంగా జవహర్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ నూర్జహాన్ ఆళ్లగడ్డకు బదిలీపై వెళ్లారు. మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓ తెలియజేశారు.

నోటు పుస్తకాల పంపిణీ



కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపిస్తున్న ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి

వీరబల్లి : రాజ్యసభ సభ్యులు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మేడా రఘునాథరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ ఎర్రపురెడ్డి పురుషోత్తం రెడ్డి విద్యార్థులందరికీ నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో శుక్రవారం ఆయన కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ వెంకటరాజు, ఉపాధ్యాయులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిరసనతో వెలిగిన విద్యుత్ దీపాలు



రాయచోటిలోని కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పాలెంగడ్డ ప్రజలు

సంబేపల్లె : మండల పరిధిలోని పాలెంగడ్డ హరిజనవాడ ప్రజలు గత కొద్దిరోజులుగా విద్యుత్ లేక చీకటిలో మగ్గారు. పలువురి నాయకులకు పలుమార్లు చెప్పినా సమస్యను పరిష్కరించలేకపోవడంతో ప్రజలు ఏకమై శుక్రవారం మొదటిగా మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరికి వినతి పత్రం అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే స్పందించిన ఆ శాఖ అధికారులు పాలెంగడ్డ హరిజనవాడలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో జిల్లా కలెక్టర్ శ్రీధర్, మండల విద్య శాఖాధికారి రాజేష్‌లకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి



రాజంపేట: రాజ్యసభ సభ్యులు రఘునాథరెడ్డికి శుభాకాంక్షలను తెలియచేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి, కుటుంబసభ్యులు



రాయచోటి టౌన్: రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఘనంగా ఎంపీ మేడా పుట్టినరోజు వేడుక
- సేవా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రాజంపేట : రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పుట్టినరోజు వేడుకలు తిరుపతి, రాజంపేట, నందలూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మేడా అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. తిరుపతిలోని మేడా భవన్‌లో ఉభయ వైఎస్సార్ జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన పార్టీ నాయకులు, అభిమానుల సమక్షంలో ఎంపీ బర్త్ డే కేక్ కట్ చేసి తినిపించారు. తన అన్న, రాజంపేట మాజీ శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి, సిద్దవటం ఇన్‌చార్జి మేడా మధుసూదన రెడ్డితో పాటు కుటుంబసభ్యులు మేడా రఘుకు శుభాకాంక్షలను తెలియచేశారు. అలాగే రేణిగుంట విమానాశ్రయంలోనూ మేడా రఘునాథరెడ్డిని కలిసి పలువురు బర్త్‌డే కేక్ కట్ చేయించారు.

తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యులు మేడా

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఏడుకొండల స్వామిని కోరుకున్నానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నానన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఆ స్వామివారి ఆశీస్సులు నిండుగా ఉండాలని ప్రార్థించానన్నారు. శ్రీవారిని దర్శించుకోవడం మహాభాగ్యమన్నారు.

వీరబల్లి నాయకుల ఆధ్వర్యంలో రక్తదానం

రాయచోటి టౌన్ : రాయచోటి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు ఎంపీ మేడా రఘునాథరెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించి రక్తదానం చేశారు. మేడా రఘునాథరెడ్డి ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అభిమానులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షులు, వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, రాష్ట్ర మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి హారూన్ బాషా, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్, సర్పంచులు గోపినాథరెడ్డి, నరసింహులు స్వామి, శివరాం, ముకుందపురం నరేష్ (స్వామి), మానెం సంతోష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ, రాజంపేట నియోజకవర్గ ఐటీ వింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం రెడ్డి, సీతారామరాజు, నాయకులు మాదిరెడ్డి జనార్దన్‌రెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, పెద్దరెడ్డెప్పరెడ్డి, చిన్న రెడ్డెప్పరెడ్డి, ఆదం బాషా, రాజంపేట స్టూడెంట్స్ వింగ్ ప్రెసిడెంట్ పఠాన్ అబ్దులా, మైనార్టీ నాయకులు అష్రఫ్ అలీఖాన్, షాహీర్ బాషా, సోమారపు రాము, వీరబల్లె మండల స్టూడెంట్స్ వింగ్ ప్రెసిడెంట్ చక్రధర్ నాయుడు, గౌస్ పీర్, మాదిరెడ్డి నాగశ్వరరెడ్డి, ఆలీ, సర్దార్, మసూద్, రెడ్డెయ్య, సాయి, అఫ్జల్ హబీబ్, మహేష్ పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ తల్లి దేవస్థానంలో శుక్రవారం రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ, గ్రామస్తులు కేక్ కట్ చేసి పిల్లలకు, ప్రజలకు పంచిపెట్టారు. అలాగే నాగిరెడ్డిపల్లెలో మండల కోఆప్షన్ సభ్యులు కరీముల్లాఖాన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గారెడ్డి, నారాయణ, అరిగే హరిబాబు, వెంకటేష్, మణి, కుంభగిరి గోపాల్, అనిల్, శివయ్య, కంత్రి శివ, ఎంపీటీసీలు భావన శ్రీధర్ గౌడ్, సుభాన్‌బాషా, ఎలుమలై, మోహన్‌రెడ్డి, మండల మహిళా నాయకురాలు పల్లె మాధవి, ఉపసర్పంచ్ ఇబ్బు, వైసీపీ సీనియర్ నాయకులు బుసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి, నరసింహారెడ్డి, విజయుడు, వార్డ్ రాజశేఖర్, శంకర, మెంబర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు భూషణ పసుపులేటి సుధాకర్, శర్మ, సురేష్, సుబ్రమణ్యంరెడ్డి, శ్రీవాణిదేవి, అమ్ములు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



నందలూరు: ప్రత్యేక పూజలనంతరం కేక్ కట్ చేస్తున్న నాయకులు

కూలి డబ్బులు చెల్లించండి.. మహాప్రభో



మండలంలోని కుమ్మరికుంటలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

సిద్దవటం : వలసల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం గతంలో తీసుకొచ్చిన బృహత్తర మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేదలను అవస్థలు గురి చేస్తోంది. గ్రామాల్లోనే పనులు కల్పించేలా అధికారులు చర్యలు చేపడుతున్న పనులు చేసిన కూలీలకు మాత్రం నగదు చెల్లించడం ఆలస్యమవుతుండటంతో కూలీల బాధ వర్ణనాతీతంగా ఉంది. మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేటలోని కుమ్మరికుంటలో శుక్రవారం పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ గత 6 వారాలుగా ఉపాధి హామీ పనులు చేసిన రోజులకు నగదు చెల్లింపులు జరగలేదన్నారు. మాకు కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నామన్నారు. దుకాణదారులు నిత్యావసర వస్తువులను అప్పులు ఇవ్వడం లేదు.. ముందు అప్పు తీర్చాలని అంటున్నారు. కుమ్మరికుంటలో ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాలు, మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. ఇక్కడ పనిచేస్తే వ్యాధులు సోకే ప్రమాదం ఉందని అధికారులు మరో ప్రాంతాంలో మాకు పనులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులు చెల్లించాలని కూలీలు అధికారులను కోరుతున్నారు.

పురోహితులు నటరాజకు ఆకేపాటి నివాళి



నటరాజ (ఫైల్)



నటరాజ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఆకేపాటి

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణ, రైల్వేకోడూరు ప్రాంతాల ప్రజలకు సుపరిచితులైన సాతాను పురోహితులు నటరాజ (71) గురువారం రాత్రి మృతి చెందాడు. దీంతో పట్టణంలోని కొలిమివీధిలో శుక్రవారం నటరాజ మృతదేహానికి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమందార్లు ఎవరైనా మృతి చెందితే వారి కర్మక్రియలను నిర్వహించేందుకు రాజంపేట ప్రాంతంలో నటరాజ ఒక్కరే ఉండేవారని, ఇప్పుడు ఆయన మృతి చెందడం తిరుమందార్లకు తీరనిలోటని తెలిపారు. కర్మక్రియల కార్యక్రమాలు అందరు చేయరని, అయితే నటరాజ ఏ సమయంలో అయినా కాదనకుండా ఆ కార్యక్రమాలను చేసేవారన్నారు. అంతేకాక పేదలు తమకు తోచినంత ఇచ్చిన నొచ్చుకునేవారు వారు కాదని అలాంటి వ్యక్తి మృతి బాధాకరమన్నారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ప్రభుత్వం ఖరీఫ్ రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతు నాయకులు

సంబేపల్లె : మండల పరిధిలోఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేసే రైతులకు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు శుక్రవారం మండల తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డితో సమావేశం నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరంలో అధికారుల నిర్లక్ష్యం వలన రైతులు నష్టపోయారని వివరించారు. వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించి రైతులకు సంబందించిన వనరులను సకాలంలో అందే విధంగా చూడాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ సీజన్‌లో సాగుచేసే వేరుశనగ, వరి తదితర విత్తనాలను 90 శాతం సబ్సిడీతో రైతులకు అందే విధంగా చూడాలన్నారు. గత ఏడాదిలో నకిలీ విత్తనాలు, నకిలీ మందులు రైతులకు అందజేశారని, ఈ ఏడాది అలాంటి జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాయచోటి అధ్యక్షుడు హరినాథనాయుడు, రైతు సంఘం సంబేపల్లె మండల అధ్యక్షుడు అర్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాడుతాం

రాయచోటి జగదాంబసెంటర్ : కార్మికుల నడ్డి విరిచేందుకు తెస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు అయ్యేంత వరకు పోరాడుతామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. జులై 9న జరిగే కార్మిక ఐక్యపోరాటాన్ని (సమ్మె) జయప్రదానికి వ్యవసాయ కూలీలు రైతులు, కూలీలు పెద్ద ఎత్తున కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వారిచ్చే కమీషన్లకు కార్మిక చట్టాలు, హక్కులు రద్దు చేసి వారిని కట్టుబానిసలుగా మార్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలియజేశారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, భాగ్యలక్ష్మి, ఓబులమ్మ, ఏవీ రమణ, వెంకట్రామయ్య, మెహరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడి పథకం దేశానికే ఆదర్శం

రాజంపేట రూరల్ : జననేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ కొనియాడారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి విద్యార్థులకు జగనన్న అండగా నిలిచారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశ పెట్టింది మా పాలనలోనే అని గుర్తు చేశారు. కాగా కూటమి నాయకులు హామీలను అమలు చేయక ప్రజలను, మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జననేత పెట్టిన పథకాల పేర్లను మార్చిన ప్రభుత్వం వాటిని అమలు చేయడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటాలు చేసి తల్లికి వందనం అమలు చేపించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు జననేత జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని చెప్పారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

ఒంటిమిట్ట : మండలానికి నూతన సీసీ రోడ్లను నిర్మించేందుకు రూ.ఐదు కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను శుక్రవారం రాజంపేట పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు చేతులమీదుగా ప్రారంభించారు. మండలంలోని పెన్నపేరూరు, గంగపేరూరు, తప్పెటవారిపల్లి, దవంతరపల్లి గ్రామాలలో నూతన సీసీ రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఈఈ రాజశేఖర్ రెడ్డి

పుల్లంపేట : సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చని ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పుల్లంపేట బైపాస్ రోడ్డులోని శ్రీనివాస కల్యాణమండపంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ యోజన పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సోలార్ వల్ల ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఏపీఎస్‌పీడీసీఎల్ కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల విద్యుత్ వినియోగదారులకు మేలు చేకూరడమే కాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పుల్లంపేట విద్యుత్ ఏఈ కుమార్, సోలార్ కాంట్రాక్టర్ ప్రకాష్ రెడ్డి, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట : రాజంపేట సబ్‌డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నూతన కార్యవర్గం నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైకోమ్ నైదియాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు చెందిన ప్రభుత్వేతర వర్గాలకు సంబంధించిన ఇద్దరు సభ్యులు నియామకానికి అర్హులన్నారు. సామాజిక స్పృహ కలిగిన, వివాద రహితులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 17లో సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్‌గా ఎన్.క్రాంతి కుమార్



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి : మండల తహసీల్దార్‌గా ఎన్.క్రాంతి కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా క్రాంతి కుమార్ అన్నమయ్య కలెక్టరేట్ నుంచి లక్కిరెడ్డిపల్లికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీపై రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు

రాయచోటి టౌన్ : నేడు రాయచోటి పట్టణంలోని అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని కోరుతూ చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు సమావేశాలు నిర్వహించి పిలుపునిచ్చారు. అమానుష పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిర్వహిస్తోందన్నారు. ఆపరేషన్ కగార్ రాజ్యాంగ నిబంధనలను కాలరాస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు విలువైన అటవీ సంపద, ఖనిజ వనరులను ధారాదత్తం చేయడం కోసం, ఆదివాసులను హత్య చేస్తోందని ఆరోపించారు. అమెరికా జోక్యంతో నిలిపేసిన పాకిస్తాన్‌తో చర్చలు చేపట్టారన్నారు. సొంత దేశంలో మాత్రం మావోయిస్టు పార్టీలతో శాంతి చర్చలు జరపకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆదివాసులను కాపాడాలంటే ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపేయాలని, అలాగే శాంతి చర్చలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమానికి వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు, ప్రసాస్వామిక వాదులు, అభ్యుద వాదులు, అందరూ పాల్గొనాలని కోరారు.

బూటకపు ఎన్‌కౌంటర్‌లను నిలిపేయాలి

బూటకపు ఎన్‌కౌంటర్‌లను నిలిపేయాలంటూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బంగారు రావులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బూటకపు ఎన్‌కౌంటర్‌ను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావలూరు విశ్వనాథ్, జల్లా కమిటీ సభ్యులు సిగి చెన్నయ్య, పి.రమణ, సుజాత, సుబ్బయ్య, జయసింహ, ఆంజనేయులు, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైల్వేకోడూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలాల పార్టీ అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పెనగలూరు మండల పార్టీ అధ్యక్షుడిగా కేతా చక్రపాణి, పుల్లంపేట మండల అధ్యక్షుడిగా సయ్యద్ ముస్తాక్, రైల్వేకోడూరు మండల పార్టీ అధ్యక్షుడిగా రామిరెడ్డి ధ్వజారెడ్డిలను నియమించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ప్రజా రవాణాధికారి రామును కలసి సన్మానిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

రాయచోటి టౌన్ : జిల్లా ప్రజా రవాణా అధికారి రామును ఏకగ్రీవంగా ఎన్నికైన నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నూతన కమిటీ నాయకులు కలసి పలు సమస్యలపై చర్చించారు. శుక్రవారం ఆయన్ను కలసి పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోషియేషన్ కడప జోనల్ అధ్యక్షులు వినోద్ బాబు, అన్నమయ్య జిల్లా రీజనల్ అధ్యక్షులు ఎంఎస్ రావు, కార్యదర్శి పీఎస్ఎం రాజులు మాట్లాడుతూ డిపో చైర్మన్‌గా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను ఆర్ఎం (రాము) దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారన్నారు. గ్యారేజీలో టూల్స్, స్పేర్ పార్ట్స్ వంటివి కొరతగా ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకెళితే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారని తెలిపారు. అలాగే యూనియన్ నాయకులతో కలసి డిపో ఆదాయాన్ని పెంచాలని డిఎం ధనుంజయకు సూచించినట్లు తెలిపారు. ఆయనను కలసిన వారిలో డిపో చైర్మన్ జియం నాయుడు, డిపో అధ్యక్షులు డివిసుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎస్ ప్రసాద్, డీఎస్ వాసులు, బిఎస్ ప్రసాద్, కె.శ్రీకాంత్, జోసెఫ్, రెడ్డెన్న, ఎస్వీఆర్ రెడ్డి, పివి చలపతి, వైఎస్ రాములు, మునికృష్ణ, సివి రమణ, ఆదినారాయణ, తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలి

సిద్దవటం : రైతులు పంటల సాగు కోసం ప్రభుత్వం ఇచ్చిన భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వేసుకోవడం వల్ల ఖర్చులు చాలా వరకు తగ్గించుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి (ఏఓ) కె.రమేష్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని వంతాటిపల్లె, టక్కోలు గ్రామాలలో ఆయన శుక్రవారం వరి నారు మడులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరి నాట్లు నాటే ముందు 20 కిలోలు జింక్ సల్ఫేట్‌ను దుక్కిలో వేసుకోవాలన్నారు. ఇది వేసిన తరువాత 4 లేక 5 రోజుల వ్యవధిలో ఒక ఎకరాకు ఒక బస్తా డీఏపీ లేదా సింగిల్ సూపర్ పాస్ఫేట్(ఎస్ఎస్‌పీ) దుక్కిలో ఒక ఎకరాకు 3 బస్తాలు వేసుకోవాలన్నారు. వరి నారు పీకే 10 రోజుల ముందు వరిలో కాండం తొలచు పురుగు, ఉల్లికోడు రాకుండా ఉండటానికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు నారు మడిలో వేసుకోవాలన్నారు. ఇలా వేయడం వల్ల ప్రధాన పొలాల్లో ఈ తెగుళ్ల పంటను ఆశించదన్నారు. నారు పీకి నాటేప్పుడు నారు కొనలను తుంచి నాటాలన్నారు. ఎందుకంటే నారు కొన బాగంలో కాండం తొలుచు పురుగులు గుడ్లు పెట్టి ఉంటుందని, అది తుంచితే అక్కడే గుడ్లను నాశనం చేయవచ్చునని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టక్కోలు రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు వంశీ శివపణీంద్ర, రైతు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్ మలుపులాంటిది

రాజంపేట టౌన్ : ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తుకు మలుపులాంటిదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ.రమణరాజు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ప్రిన్సిపల్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణరాజు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు తల్లిదండ్రులు కాస్త స్వేచ్ఛ ఇస్తారని, అయితే ఆ స్వేచ్ఛని విద్యార్థులు దుర్వినియోగం చేసుకోరాదన్నారు. సమయాన్ని వృథా చేసుకున్నా, స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకున్నా భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువు చదవాలి అన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ఎంసెట్, నీట్‌లలో ర్యాంకులు సాధించి ఇంజనీర్లు, డాక్టర్లు కావాలని ప్రిన్సిపల్ ఆకాంక్షించారు. ఇందుకు తన నుంచి, ఉపాధ్యాయుల నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని తెలిపారు. ఫిజిక్స్ అధ్యాపకుడు బి.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే ప్రమాదాలు



పరిమితికి మించి కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి మాట్లాడుతున్న ఎస్ఐ, సిబ్బంది

ఓబులవారిపల్లె : ప్రమాదకర స్థాయిలో మనుషులను ఎక్కించుకొని వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పి.మహేష్ నాయుడు అన్నారు. శుక్రవారం సాయంత్రం మంగంపేట జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అతివేగం కారణంగా జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని, పరిమితికి మించి ట్రాక్టర్లలో, ఆటోలలో మనుషులను ఎక్కించుకొని వెళ్తున్న సమయంలో ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ ప్రాణనష్టం జరుగుతుందని, ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణించాల్సి వస్తుందన్నారు. జాతీయ రహదారిపై స్కూటర్లు నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ఉదయం కారు ప్రమాదంలో హెల్మెట్ ధరించని కారణంగా వ్యక్తి మృతి చెందడం జరిగిందన్నారు. వాహనదారులు తమవద్ద పత్రాలు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రమాదాలను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించక తప్పదని వారన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యత ఇస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు శుక్రవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలను ఆసాంతం విన్న ఆకేపాటి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపించారు. కొన్ని సమస్యలను త్వరలో పరిష్కారిస్తామని హామీ ఇచ్చి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలన అస్తవ్యస్తంగా కొనసాగుతోందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసి ప్రచారాలతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. గ్రామ స్థాయిలోని ప్రజల సమస్యలను పరిష్కరించటంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వారికి అండగా నిలవాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట రూరల్ : పట్టణంతో పాటు సరస్వతీపురం, తాళ్లపాక, బ్రాహ్మణపల్లి, ఆకేపాడు సబ్ స్టేషన్‌ల సమీపంలోని ప్రాంతాలలో అదే విధంగా నందలూరు పట్టణం, మండలం పరిధిలో, పుల్లంపేట పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రాజంపేట డివిజన్ విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.